1-7-2010

# 'నీలి నాలుక'కు ముందు జాగ్రత్తలే మేలు



మేత మేస్తున్న గొర్రెలు (ఇన్‌సెట్‌లో) డాక్టర్.సుధీర్

వర్షాకాలంలో గొర్రెలకు వచ్చే ముఖ్యమైన వ్యాధులలో నీలి నాలుక ఒకటి. ఇది రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలోనూ, అన్ని రకాల గొర్రెలకూ సంక్రమిస్తుంది. ముఖ్యంగా వలస వెళ్లే గొర్రెలలోనూ, సంవత్సరం లోపు గొర్రెలలోనూ ఎక్కువగా కన్పిస్తుంది. ఈ వ్యాధినే వివిధ ప్రాంతాలలో మూతి వాపు, మూతి పుండ్లు, పూత రోగం అని కూడా పిలుస్తుంటారు.

## ఎలా వస్తుంది?

ఈ వ్యాధి సూక్ష్మాతి సూక్ష్మజీవుల కారణంగా వస్తుంది. క్యూలికాయిడస్ అనే దోమ కాటు వల్ల ఈ వ్యాధికారక క్రిములు గొర్రెల శరీరంలోకి ప్రవేశిస్తాయి. వ్యాధికి కారణమైన దోమలు సాయంకాలం వేళ, లోతట్టు ప్రాంతాలలో, నేల చిత్తడిగా ఉండే ప్రాంతాలలో ఎక్కువ సంఖ్యలో తిరుగుతాయి. వ్యాధి కారక సూక్ష్మజీవులు ముందుగా పశువులలో వృద్ధి చెంది తర్వాత దోమ కాటు ద్వారా గొర్రెలలో ప్రవేశిస్తాయి.

## వ్యాధి లక్షణాలు

ఈ వ్యాధి సోకితే మందలో ఉన్న కొన్ని గొర్రెలు అకస్మాత్తుగా నీరసపడతాయి. వాటికి 106-107 డిగ్రీల ఫారన్‌హీట్ జ్వరం వచ్చి కళ్లు, నోటి నుండి చొంగ కారుతుంటుంది. జ్వరం వచ్చిన 48 గంటల లోపు గొర్రెల పెదవులు, చిగుళ్లు, ముఖం వాచిపోతాయి. పెదవుల లోపలి భాగంలోని చిగుళ్లు ఎర్రబడి చిన్న చిన్న పుండ్లు ఏర్పడతాయి. ఈ వ్యాధి క్రమేపీ కాళ్లకు కూడా పాకుతుంది. గిట్టల మొదటి భాగం వాస్తుంది. గిట్టల మధ్య ఎర్రగా మారుతుంది. వ్యాధి సోకిన గొర్రెల నోట్లో పుండ్లు ఏర్పడతాయి. నోరు పుచ్చిపోతుంది. గొర్రెలు నడవలేవు. ఆహారం లేక నీరసించి పోతాయి. ఆ తర్వాత తగిన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో చనిపోతాయి.

## ఎలా నివారించాలి?

నీలి నాలుక వ్యాధి రాకుండా నివారించేందుకు ప్రస్తుతం టీకా మందులు అందుబాటులో లేవు. వాటిని ఉత్పత్తి చేసేందుకు జరుగుతున్న పరిశోధనలు చివరి దశలో ఉన్నాయి. అందువల్ల ముందు జాగ్రత్త చర్యల ద్వారా వ్యాధి వ్యాప్తిని, ఉధృతిని అరికట్టవచ్చు. వర్షాకాలంలో గొర్రెల పాకలోనూ, పరిసర ప్రాంతాలలోనూ దోమలను నివారించడానికి వేప ఆకు పొగ వేయాలి. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గొర్రెలను సాయంకాలం వేళల్లో లోతట్టు ప్రాంతాలలో మేపకూడదు. గొర్రెలు, పశువులను ఒకేసారి మేపుకుంటే దోమ కాటు నుండి గొర్రెలను కాపాడుకోవచ్చు.

## చికిత్స

వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే పశు వైద్యుని సంప్రదించి తగిన చికిత్స చేయిస్తే వ్యాధిగ్రస్తమైన గొర్రెలను కాపాడుకోవచ్చు. నోటిలోని పుండ్లను ఒక శాతం పొటాషియం పర్మాంగనేటు ద్రావణంతో కడిగి బోరోగ్లిసరిన్ పేస్టును నోటిలో రుద్దాలి. వ్యాధి సోకిన గొర్రెలకు యాంటీబయటిక్ మందులు, బీ కాంప్లెక్స్ ఇంజక్షన్లతో పాటు కాచి చల్లార్చిన గంజి తాగించాలి.

డాక్టర్ డి.సుధీర్
డాక్టర్ ఎమ్.ఎస్.ప్రసాద్
డాక్టర్ సి.ఆర్. త్యాగరాజ్
కృషి విజ్ఞాన కేంద్రం
రంగారెడ్డి జిల్లా